క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన జీఎం



రవిని సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఐఈడీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన బొజ్జా రవిని ఆదివారం బీఎంఎస్ నాయకులు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో మాధవనాయక్, బి.రాంసింగ్, జీవీ కృష్ణారెడ్డి, బి.సుందర్‌రావు, రంజీత్‌కుమార్, రాజేందర్, నరేష్, ఎం.మోహన్‌రావు, ఐ.నాగేశ్వరరావు, రాకేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం అటవీ ప్రాంతం నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను కొమరారం అటవీశాఖ డీఆర్‌ఓ మస్తాన్ ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అడవిలో గస్తీ నిర్వహించి కలపతో నిండుగా లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా పంచనామా చేసి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న కలపను ఇల్లెందు కలప డిపోకు తరలించారు.

విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి



మృతి చెందిన కోడె దూడ

టేకులపల్లి: విద్యుత్ షాక్ తగిలి కోడె దూడ మృతి చెందింది. వివరాలు... మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జినక ఇస్తారికి చెందిన కోడె దూడ మేతకు వెళ్లింది. గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న సమయంలో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎత్తుగా మట్టి పోసి ఉంది. దాని పైకి కోడె వెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో యజమానికి రూ.40వేల వరకు నష్టం వాటిల్లింది. తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

రెండ్లు కార్లు ఢీ.. ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

జూలూరుపాడు: దండుమిట్టతండా గ్రామం వద్ద ఆదివారం రాత్రి తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు... భద్రాచలంలో నివాసం ఉంటున్న తొగరు సిద్ధార్థ తన సొంత ఊరు తనికెళ్లకు కారులో వెళ్లి తిరిగి భద్రాచలం వెళ్తున్నాడు. మరో కారు కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తోంది. దండుమిట్టతండా గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది. సిద్ధార్థకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానికుల సహకారంతో జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు కార్లూ దెబ్బతిన్నాయి. అదే సమయానికి జూలూరుపాడు వైపు నుంచి కొత్తగూడెం వెళ్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఘటనా స్థలం వద్ద ఆగారు. గాయపడ్డ క్షతగాత్రుడిని పరామర్శించి, ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించే విధంగా చూడాలని 108 సిబ్బంది, పోలీసులకు సూచించారు.

వర్షం వస్తే మునకే..

- పట్టణ నడిబొడ్డున ఉన్నా రోడ్లకు దిక్కులేదు
- నెహ్రూనగర్‌లో కానరాని డ్రెయినేజీ వ్యవస్థ
- వీధిలైట్లు, తాగునీటి పంపులు లేక ఇబ్బందులు



ఆదివారం కురిసిన వర్షానికి నెహ్రూనగర్ రోడ్డు పరిస్థితి ఇలా..

పాల్వంచ: పట్టణ నడిబొడ్డున ఉన్న నెహ్రూనగర్‌పై అధికారులు వివక్ష చూపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వస్తే ఈ ప్రాంతంలో నీళ్లు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ మొత్తం మునిగిపోతున్న పరిస్థితి. రోజురోజుకు పట్టణం విస్తరణ అవుతున్న నేపథ్యంలో కేఎల్‌ఆర్ గర్ల్స్ కళాశాల ఏరియాల గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. కాగా ఇక్కడ ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు నివాస సముదాయాలు నిర్మించుకుంటున్నారు. కానీ ఈ ఏరియాలో రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, నల్లాలు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఏరియా విస్తరిస్తున్నా... అభివృద్ధి సున్నా..

కేఎల్‌ఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల పక్కన ఉన్న ఈ ఏరియా ప్రశాంత వాతావరణం ఉంటుంది. దీంతో ఇక్కడ ఎక్కువ మంది ఉద్యోగులు, ఇతర వర్గాల వారు ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఇటీవల కాలంలో ఇళ్ల నిర్మాణాలు సైతం భారీగా పెరిగాయి. కానీ మున్సిపాలిటీ అధికారులకు మాత్రం ఈ ఏరియాపై సీతకన్ను అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు లేక పోవడం గర్హనీయం. ఇంటర్, డిగ్రీ, ప్రైవేట్ పాఠశాల, హాస్టళ్లతో పాటు, కాలనీవాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గతుకుల రోడ్లలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్లు లేక రాత్రి అయితే ఇబ్బందులు వర్ణనాతీతం. తాగునీటి పంపులకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిన్నపాటి వర్షానికి జలమయం...

చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం జలమయంగా మారుతోంది. ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఆ ప్రాంతమంతా నీళ్లు చేరి స్థానికుల రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. గత వర్షాకాలంలో వరద నీళ్లు ఇళ్లలోకి చేరాయి. కొన్నిచోట్ల నాలుగు, ఐదు అడుగుల మేర నీళ్లు వచ్చి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వేసవిలో అడపా దడపా వస్తున్న వర్షాలకే ఇబ్బందులు పడుతున్నారు రాబోయే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంత అభివృద్ధికి, స్థానికులు ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే స్థానిక ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతులు సైతం ఇచ్చామని, అయినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ కె.సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



కేఎల్‌ఆర్ గర్ల్స్ కళాశాల పక్క రోడ్డు

చిన్నపాటి వర్షానికే జలమయం...



చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్లు వేయక పోవడంతో గుంతలమయంగా రాకపోకలకు కష్టంగా ఉంది. వర్షం వస్తే నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – జ్యోతి, స్థానికురాలు

కనీస సౌకర్యాలు లేవు...



నెహ్రూనగర్ ఏరియాలోపై అధికారులు వివక్ష చూపుతున్నారు. రోడ్లు వేయాలని గతంలో పలుమార్లు అధికారులను కలిసి కోరాం. స్పందించడం లేదు. కళాశాల వద్ద రోడ్లు లేక కంకర తేలింది. గర్ల్స్ కళాశాల పక్కన ఒక్క సీసీ రోడ్డు కూడా లేదు. అధికారులు స్పందించాలి. – శ్రీరామ్, స్థానికుడు

ప్రతిపాదన దశలో ఉన్నాయి...



నెహ్రూనగర్‌లో సమస్యలను పరిశీలిస్తాం. ఈ ఏరియాలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశాం. విడతల వారిగా అవసరమైన చోట నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరిస్తాం. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కృషి చేస్తాం. – మురళీ, ఇన్‌చార్జ్ డీఈ

అన్నదాతల్లో ఆందోళన



మాణిక్యారం మార్గంలో రోడ్డుపై మక్కలను ఆరబెట్టుకుంటున్న రైతులు



వర్ష భయంతో మక్కలను లారీల్లోకి లోడ్ చేస్తున్న హమాలీలు

ఇల్లెందురూరల్: వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుత యాసంగిలో దిగుబడి బాగానే వచ్చిందన్న ఆనందాన్ని వరణుడు మటుమాయం చేస్తున్నాడు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా జోరుగా వరికోతలు సాగుతున్నాయి.

తేమశాతం కోసం రహదారులపై, కల్లాల్లో ధాన్యం, మొక్కజొన్నలను రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ఇలా కొమ్ముగూడెం నుంచి మస్సివాగు, మాణిక్యారం మీదుగా కొమరారం వరకు రోడ్లపై ధాన్యపు రాసులే కనిపిస్తున్నాయి. ఇక పోలారం గ్రామపంచాయతీలో గ్రామం పరిధిలో రోడ్లపై, గ్రామంలోని ఖాళీ స్థలాల్లో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వాతావరణంలో మార్పులు, స్వల్పంగా వచ్చిన చినుకులు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి. ఇదిలా ఉండగా మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా లేకున్నా, ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకున్నా వాతావరణంలో మార్పుల కారణంగా ఆదివారం ఎండతీవ్రత అధికంగా ఉండటంతో మక్కలను, ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.125 తక్కువతో క్వింటా రూ.2,100కే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇక కొంతమంది ధాన్యాన్ని భద్రపర్చుకొని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని కాపాడాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ అన్నారు. ఆదివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ... గుండెపుడి రెవెన్యూ పరిధిలోని రెండు కుంటల ప్రభుత్వ భూమిలో ఆక్రమణకు గురైన స్థలాన్ని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.

ఘనంగా ‘జలగం’ జయంతి

పాల్వంచ: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు 103వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పూర్ణ టీస్టాల్ ఆవరణలో కేక్ కట్ చేశారు. మంజూరు, జమ్ముల సీతారాంరెడ్డి, కేశులాల్ నాయక్, శ్రీపాద సత్యనారాయణ, బొల్లం భాస్కర్‌రావు, దుర్గాప్రసాద్, సమ్మిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కొండపల్లి సీతారామయ్య, అప్పలనాయుడు, కేసరి రవీందర్, మురళీ కృష్ణ, సుజిత్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బందులు



కుంటను తలపిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

పాల్వంచరూరల్: ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షం నీరు నిల్వచేరి ఉండటంతో చిన్నపాటి కుంటను తలపించింది. ప్రతీసారి వర్షం కురిసినప్పుడల్లా నీరు నిల్వచేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

వర్షానికి తడిసిన క్రీడామైదానం... క్రికెట్ టోర్నీ వాయిదా

కిన్నెరసానిలోని గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ఆదివారం జరగాల్సి ఉండగా భారీ వర్షం కురవడంతో క్రీడామైదానంలో మొత్తం నీరు ప్రవహించడంతో టోర్నీని పీఓ వాయిదా వేసినట్లు స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు కొంతమంది మాత్రం గిరిజన గురుకుల కళాశాల మైదానంలో క్రికెట్‌ను ఆడుకుని వెళ్లారు.

కనువిప్పు కలగాలి..

ఇల్లెందు: కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా ప్రయత్నించిన కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే సార్వత్రిక సమ్మె సాగాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కోయగూడెం, సత్తుపల్లి ఓసీలకు టెండర్లు జరిగినా పనులు ప్రారంభం కాలేదన్నారు. టెండర్ పాలసీ ప్రకారం ఏడాది కాలంలో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోక్యం చేసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వ వైఖరి వల్ల బొగ్గు గనులు రాకుండా పోతున్నాయని తెలిపారు. సింగరేణిలో 27 అండర్ గ్రౌండ్ మైన్‌లు, 17 ఓసీలు ఉన్నాయని, 2025లో రెండు అండర్‌గ్రౌండ్ మైన్లు మూత పడతాయన్నారు. ఇల్లెందులో 12 వేల మంది కార్మికులు ఉంటే నేడు 600 మంది మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు. పూసపల్లి ఓసీని వెంటనే విస్తరించాలని కోరారు. సింగరేణి సంస్థ ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, ఎస్వీ రమణ, ఎండీ నజీర్ అహ్మద్, రాజారం, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, అజ్మీర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సమ్మె నోటీస్...

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, సింగరేణి పరిరక్షణ కోసం, కొత్త గనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ కోరారు. ఆదివారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. సిరాజ్ అహ్మద్, అబ్బాస్, కృష్ణ, రాజమొగిలి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం కండి..



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న భూపాల్

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక హక్కుల రక్షణకై మే 20న సమ్మెకు సిద్ధం కావాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, హక్కులను కాలరాస్తున్న బీజేపీ నియంతపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.భూపాల్ పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సకల కార్మికులు భారతదేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం అవుతున్నారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నూతన కార్మిక కోడ్‌ల పేరుతో నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్మికులను టార్గెట్ చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న పద్ధతులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.

ఎన్‌ఎండీసీని పునరుద్ధరించండి..



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

చుంచుపల్లి: హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కలిశారు. ఈ మేరకు పాల్వంచలోని ఎన్‌ఎండీసీ పరిశ్రమను తిరిగి పునరుద్ధరించి కార్మికులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కేంద్రమంత్రి వెంటనే సంబంధిత అధికారులకి ఫోన్ చేసి పునరుద్ధరణకు సాధ్యాసాధ్యాలను అడిగి తెలుసుకున్నారని, సమస్య పరిష్కారినికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి కొత్త బస్ సర్వీసులు

ఇల్లెందు: ఇల్లెందు బస్టాండ్ నుంచి మణుగూరు, సత్తుపల్లికి రెండు ఎక్స్‌ప్రెస్ బస్‌లను సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించనున్నారు. తగిన ఏర్పాట్లు చేశారు. ఇల్లెందు బస్ డిపోకు ఎనిమిది కొత్త బస్‌లు వచ్చాయి. గత ఏడాది కాలంగా అటు ప్రయాణికులు, ఇటు డ్రైవర్ కండక్టర్లు పాత బస్‌లతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఆర్టీసీ అధికారుల మీద తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఆరు పల్లె వెలుగు బస్‌లను గుండాల–ఇల్లెందు, ఇల్లెందు –కొత్తగూడెం, ఇల్లెందు – ఖమ్మం మధ్య నడుపుతున్నారు. ఇక ఇల్లెందు డిపో నుంచి రెండు కొత్త రూట్లలో కూడా బస్‌లు నడపాలని నిర్ణయించారు. ఇల్లెందు– కారేపల్లి – డోర్నకల్‌కు ఒక సర్వీస్, ఇల్లెందు – కొమరారం– చెట్టుపల్లికి మరో బస్ సర్వీస్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ రెండు రూట్లు కూడా పరిశీలన తుది దశకు చేరింది. ఒకటి రెండు రోజుల్లో చెట్టుపల్లి, డోర్నకల్ బస్‌లు నడిచే అవకాశాలు ఉన్నాయి. ఇక చీమలపాడు మీదుగా ఏన్కూర్ వరకు కూడా ఒక బస్ సర్వీస్ ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు



టేకులపల్లి: మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రారంభించిన ఇందిరమ్మ ఇంటి పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని టేకులపల్లి మండలం తడికలపూడి పంచాయతీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు వాసం బుచ్చి రాములు, బానోతు శంకర్, ఉకే సత్యం, ఉకే శిల్ప, అజ్మీర జ్యోతి అన్నారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... తడికలపూడి పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రజాపాలనలో పంచాయతీలో ఇల్లు కోసం 565 దరఖాస్తులు వచ్చాయని అందులో అధికారులు 276 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. అయితే పంచాయతీకి 30 ఇళ్లు మాత్రమే మొదటి విడతగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అధికారుల ఆదేశాల మేరకు పాత తడికలపూడి 14 , కోక్యా తండాలో 13, లక్ష్మీపురంలో ముగ్గురిని మొత్తం 30 మందిని లబ్ధిదారులుగా గుర్తించామని తెలిపారు. మిగతా వారిని దశలవారీగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీకి మంజూరైవే 30 ఇళ్లు అయితే 276 మందిని ఎలా ఎంపిక చేస్తామని, పనికట్టుకుని కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ పేదలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అధికారులు తనిఖీలు నిర్వహించి తుది ఎంపికకు చేస్తారన్నారు.

జూలూరుపాడు: ఇళ్లు లేని ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ నాయకుడు అనిల్ నాయక్ అన్నారు. ఆదివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. పేదోడి సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా జరుగుతుందని, అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

టేకులపల్లి: కోయగూడెం గ్రామంలో బొడ్రాయి, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. బోనాలతో మహిళలు, యువతులు భారీగా ఊరేగింపుగా బయలుదేరి గ్రామదేవతలను దర్శించుకుని బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య జానపద భక్తి పాటలకు వేసిన నృత్యం అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కోరం సురేందర్, తుళ్లూరి బ్రహ్మయ్య, నాగ సీతారాములు, మల్లిబాబు యాదవ్, డీవీ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న మహిళలు

కూరగాయల సాగుపై ఆసక్తి

- మూడేళ్ల విరామం తర్వాత ముందస్తుగా కదలిక
- కాకర, బీర సాగుపై రైతుల మొగ్గు



కొమరారంలో కూరగాయల సాగుకు దుక్కి సిద్ధం చేసిన దృశ్యం

ఇల్లెందురూరల్: ఆ పల్లెలు కూరగాయల సాగుకు చిరునామాగా పేరెన్నికగన్నాయి. సుమారుగా రెండు దశాబ్దాల కాలంలో సీజన్‌వారీగా కూరగాయల సాగు చేస్తూ ఇల్లెందుతోపాటు కొత్తగూడెం, ఖమ్మం , వరంగల్, విజయవాడ మార్కెట్లకు కూడా కూరగాయలను ఎగుమతి చేసిన ఘనత ఆ గ్రామాల సొంతం. ఇంతటి ఘనకీర్తి సాధించిన ఉమ్మడి కొమరారం గ్రామపంచాయతీ పరిధిలో మూడేళ్లుగా కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గించిన రైతులు ప్రస్తుతం అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రెండు దశాబ్దాలకు పైగా..

సాధారణ పంటల సాగుతో వరుస నష్టాలను చవిచూసిన రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఒక్కొక్కరుగా కూరగాయల సాగు చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు. దీనికితోడు ప్రభుత్వాలు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం రైతులకు కలిసి వచ్చింది. ఏడాదికేడాది సౌకర్యాలను పెంచడంతో కూరగాయల సాగు విస్తీర్ణం కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఐటీడీఏ, ఉద్యాన శాఖల సహకారం కూడా తోడవడంతో కూరగాయల సాగు విస్తీర్ణం వందల ఎకరాలకు చేరుకుంది. ఇలా రైతులు స్థానిక అవసరాలకు కూరగాయలను అందిస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నారు. కానీ నాలుగేళ్లుగా చీడపీడీల ఉధృతి కారణంగా చాలామంది సాగుకు వెనకడుగు వేశారు. కానీ గతేడాది కూరగాయల రైతులు లాభాలను పొందడంతో ఈసారి పలువురు రైతులు కూరగాయలు సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

తొలి పంటగా కాకర సాగు..

ఇల్లెందు ఏజెన్సీలో తొలి పంటగా కాకరను రైతులు సాగు చేస్తుంటారు. దీనికోసం ఏప్రిల్‌లోనే దుక్కులు సిద్ధం చేసి మే నెల ప్రారంభంలో కాకర విత్తనాలు విత్తుకుంటారు. ప్రధానంగా పందిరి సాగుకు అవసరమైన కర్రలను సేకరించుకోవడంలో అటవీశాఖ ఆంక్షలు రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. కానీ కూరగాయల సాగుపై మక్కువ, అనుభవం కలిగిన రైతులు గతంలో సేకరించిన కర్రలకు సిమెంటు స్తంభాలను జోడించి పందిరి వేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు విత్తుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

విక్రయ సౌకర్యం కల్పిస్తే..

చేనులో కోసిన కూరగాయలను రైతు నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తే దళారులు రంగప్రవేశం చేసి వారికి ఇష్టమైన ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఒక్కో సమయంలో గిట్టుబాటుకు కాక నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతు బజార్ ఏర్పాటు చేస్తామని పాలకులు ఆ తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. శీతల గిడ్డంగి నిర్మించకున్నా రైతు తాను పండించిన పంటను తానే విక్రయించుకునే సౌకర్యం కల్పిస్తే రైతులకు కొంతైనా మేలు జరుగుతుది.

వినియోగదారులకు ఊరట...

బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కాలం ఏదైనా ధరల పట్టికలో మాత్రం మార్పు కనిపించడం లేదు. గతంలో స్థానికంగానే కూరగాయలు విరివిగా పండటంతో కొన్ని కూరగాయల ధరలైనా అదుపులో ఉండేవి. కానీ మూడేళ్లుగా కూరగయాల సాగుకు రైతులు విరామమివ్వడంతో ఇల్లెందు ప్రాంతంలోనూ కూరగాయల ధరలు కొండెక్కాయి. ఈ పరిస్థితిలో స్థానిక రైతులు మళ్లీ కూరగాయల సాగును ప్రారంభించడం వినియోగదారులకు ఊరట కలిగిస్తోంది.

రైతు బజార్లను నెలకొల్పాలి..



మండు వేసవిలో కాకర, అధిక వర్షాల సమయంలో బీర, చలికాలంలో టమాట, ఇతర పంటలు పండిస్తున్నాం. ఇంత శ్రమించినా పెట్టుబడి కూడా చేతికందడం లేదు. వ్యాపారుల దోపిడీ నుంచి రక్షించేందుకు రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. – మంచె రమేష్, రైతు, కొమరారం

సాగుకు సిద్ధమయ్యాం..



పంటలను ఆశించిన చీడపీడలు, ధరల పతనం, మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో మూడేళ్లుగా కాకర సాగుకు విరామమిచ్చాం. ఈ ప్రభావం ఇతర ఉద్యాన పంటలపైనా చూపింది. గతేడాది అనుకూల పరిస్థితి కనిపించడంతో కూరగాయల సాగును మళ్లీ ప్రారంభిస్తున్నాం. – వాంకుడోత్ బాలు, రైతు, కొమరారం